క్లుప్తంగా

గండిచెరువుగట్టులో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం



మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పెదపాడు: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 110మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ పరీక్షల్లో అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా.చక్రధర్, ఎఎన్ఎంలు కృపావతి, వరలక్ష్మి, శివలీల, ఆశావర్కర్లు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక శిబిరాలు



దెందులూరులో చిన్నారులతో పత్రికలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి టీ.ఝాన్సీ

దెందులూరు: విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం వేసవిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం శుభపరిణామమని దెందులూరు గ్రంథాలయాధికారి టీ.ఝాన్సీ అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. పత్రికలు, ప్రముఖుల జీవితచరిత్రలు, శాస్త్రవేత్తలు, నిఘంటువులు అన్ని అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు జూన్ 12వ తేది వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఉన్నత పాఠశాల గ్రంథపాలకుడు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత భూముల్లో పంటలు పండించాలి

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పంపిణీ చేసిన భూముల్లో పంటలు పండించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ పీఓ ఛాంబర్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పంపిణీ చేసిన వ్యవసాయ భూముల్లో ఎత్తుపల్లాలను సరిచేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ ప్రవుల్ కుమార్‌ను ఆదేశించారు. సాగు చేపట్టిన వారికి రైతు భరోసా పథకం, క్రాప్ లోన్ మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ బుచ్చిబాబును ఆదేశించారు. ఏపీఓ పీవీఎస్ నాయుడు, ఎన్ఆర్ఈజీఎస్ ఎలక్ట్రికల్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30న చింతలపూడిలో మెగా జాబ్ మేళా

చింతలపూడి: ఈనెల 30న స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు సచివాలయ సిబ్బందికి జాబ్ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబ్ ఫెయిర్‌లో 18 కంపెనీల ప్రతినిధులు నేరుగా పాల్గొని రెండు వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డీఎస్‌డీఓ ఈ తమ్మాజిరావు, పీఓలు ప్రవీణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

లింగపాలెం: భూవివాదాలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం ద్వారా భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు వైఎస్సార్ సీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి) తెలిపారు. లింగపాలెంలో శుక్రవారం డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈమేరకు బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈసర్వేను పూర్తిగా ఆధునిక పద్ధతుల్లో డ్రోన్లను వినియోగించి నిర్వహిస్తోందన్నారు. సర్పంచ్ తగరం హేమలత, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, ఎంపీటీసీ బి స్వరూప, మండల సేవాదళ్ అధ్యక్షుడు రెడ్డి బాబ్జి, వైసీపీ నాయకులు బి ప్రభాకరరెడ్డి, సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, శ్రీనువాసరెడ్డి, శావా రాజేష్, కార్యదర్శి పి సుగుణరావు, సర్వేర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



రాయన్నపాలెం వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : వలంటీర్ వ్యవస్థ దేశంలో ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లకు పురస్కారాలు అందజేత కార్యక్రమం రాట్నాలకుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, స్థానిక నాయకులతో కలిసి వందేమాతరం గీతంతో 'వలంటీర్‌లకు వందనం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేయండంలో విశేషంగా కృషి చేసిన వలంటీర్లుకు ప్రశంసాపత్రాలు, అవార్డులు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గొప్ప వేడుకగా వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, 5 మందికి సేవా రత్న, 410 మందికి సేవా మిత్ర అవార్డులను అందిస్తున్నట్టు ప్రకటించారు. వలంటీర్లు తాము సేవ చేస్తున్న యాభై కుటుంబాలను తమ కుటుంబాలుగా భావిస్తూ సేవలందించడం అభినందనీయమన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్లు, సచివాలయాలను స్థాపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇంటికి వద్దకే పాలన తెచ్చారన్నారు. ఆరోగ్యశ్రీతో ప్రతి పేదవాడు కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందే అవకాశం కలిగిందన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, ఏఎంసి వైస్ చైర్మన్ కాటి సుధాకర్, ఎంపీపీ తాతా రమ్య, రట్నాలకుంట గుడి చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎండీఓ గంజి రాజ్ మనోజ్, పెదవేగి సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, ముండూరు సొసైటీ చైర్మన్ చెరుకూరి ప్రసాద్, విజయరాయి సొసైటీ అధ్యక్షులు పాలడుగు సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ కేశన సతీష్, ఘంటా ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయాలన్నదే భావన



ప్రజలకు సేవ చేయాలనే భావనతోనే వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయడం ఆనందంగా ఉంది. వలంటీర్లపై అధికారులతోపాటు రాజకీయ నాయకుల ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందజేయగలుగుతున్నాం. తమను ప్రభుత్వం గుర్తించి పురస్కారాలు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయం. – కొండపల్లి నాగరాజు బాపిరాజుగూడెం వలంటీర్

సీఎం జగన్ ఆశయ సాధనకు కృషి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించడం మా ధ్యేయం. నెల మొదటిరోజే వృద్ధులకు పింఛన్ అందజేయటం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చేందుకు వలంటీర్‌గా నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను.

– కె కమల ప్రియదర్శిని కొండలరావుపాలెం సేవరత్న వాలంటీర్

ఫ్యామిలీ ఫిజీషియన్ గ్రామీణులకు వరం



గణపవరంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

గణపవరం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గ్రామీణ పేదప్రజలకు వరమని, ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభించిన ఈ సేవలను వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శుక్రవారం గణపవరం గ్రామ సచివాలయం– 3 పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సాధారణ వ్యాధిగ్రస్తులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన ఇద్దరు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి నెలలో మూడు సార్లు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, 67 రకాల మందులు, 14 రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



నాగులదేవునిపాడులో నాయకులకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మండలంలో నాగులదేవునిపాడులో టీడీపీకి మరోసారి ఎదురుదె దెబ్బ తగిలింది. గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, పార్టీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, బోయపాటి గణేష్‌ల ఆధ్వర్యంలో టీడీపీ మాజీ వార్డుమెంబర్లు గుజ్జుల చంద్రశేఖర్, గుజ్జుల చినఅబ్రహాం, తోట జాన్, సరిపల్లి రాయప్ప, గుజ్జుల దావీద్‌లు శుక్రవారం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పార్టీ కండువాను వేసి వైఎస్సార్‌సీపీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, ఎంపీటీసీ సొంగా ప్రమీలరాణి వార్డు మెంబర్లు వన్నెకూటి రాజేష్, శ్రీధర్, రాజు, ప్రవీణ్, మల్లిక్, ఏడుకొండలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు



నాగులదేవునిపాడులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలకోసం శ్రమిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల ఉద్యోగులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందడం, సమస్యలుంటే పరిష్కరించడం, ఉద్యోగులందరి ఏకైక అజెండాగా ఉండాలన్నారు. ఎఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ ఎఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ నాయకులు బోయపాటి గణేష్, ముసునూరి వెంకటేశ్వరరావు, తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, వలంటీర్లు, ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి

- గాలి వాన బీభత్సానికి కూలిన స్తంభాలు, తెగిన తీగలు
- విద్యుత్ శాఖకు రూ.15 లక్షల నష్టం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పునరుద్ధరణ పనులు





భీమడోలు జంక్షన్‌లో పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఈఈ శశిధర్, అంబర్‌పేట పొలాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

భీమడోలు: గాలి, వాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు కూలిపోయి, తీగలు తెగిపడటంతో గురువారం రాత్రి గ్రామాల్లో అంధకారం ఏర్పడింది. ఒక్కసారిగా ఆకాశంలో పిడుగుల శబ్దాలతో కూడిన వాన కురవడంతో ప్రజలంతా భీతిల్లారు. భారీ వృక్షాలు సైతం రోడ్లపై నేలకొరిగాయి. కొన్ని చోట్ల పెంకుటిల్లు, తాటాకిళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ఇటీవల పూళ్ల, అంబర్‌పేట సబ్‌స్టేషన్లల్లో గాలి,వాన బీభత్సానికి విద్యుత్ శాఖకు జరిగిన నష్టం మరవకముందే గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ శాఖకు మరోసారి అధిక నష్టం సంభవించింది. భీమడోలు, ఎం.నాగులపల్లి, అంబర్‌పేట, కురెళ్లగూడెం, దుద్దేపూడి తదితర గ్రామాల్లో ఈదురు గాలులకు పెను నష్టం సంభవించింది. భీమడోలులో 20, ఎం.నాగులపల్లిలో 10, అంబర్‌పేటలో 14 ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లింది. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో అధికారులు పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికను చేపట్టారు. ఏలూరు విద్యుత్ శాఖ ఈఈ శశిధర్ పర్యవేక్షణలో ఏడీఈ కె.గోపాలకృష్ణ నేతృత్వంతో ఏఈలు రామస్వామి, రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సమస్య పరిష్కార చర్యలకు ఉపక్రమించారు. తీవ్రంగా శ్రమించి శుక్రవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భీమడోలు, ఎం.నాగులపల్లి, కురెళ్లగూడెంలో చేపట్టిన పనులను ఈఈ శశిధర్ పరిశీలించారు. పాత వాటిని తొలగించి కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసారు. అంబర్‌పేట ఏరియాలో సాంకేతిక సమస్య తలెత్తడంతో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మిగిలిన అన్ని గ్రామాల్లో త్రీఫేజ్‌ను పునరుద్ధరించారు. అంబర్‌పేటలో శనివారం పునరుద్ధరణ పనులు చేస్తామని ఏడీఈ కె.గోపాలకృష్ణ తెలిపారు. భీమడోలు పంచాయతీ పరిధిలో కూలిన చెట్లను సర్పంచ్ పాము సునీతామాన్ సింగ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో తొలగించారు.

పుస్తక పఠనంతో ఉన్నత స్థితి



పూళ్లలో యోగాసనాలు వేసిన చిన్నారులు

భీమడోలు: విద్యార్థులు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలన్న లక్ష్యానికి పుస్తక పఠనం ఆయుధమని డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి సత్యేంద్ర అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 19వ రోజైన శుక్రవారం ప్రత్యేక శిక్షణ తరగతులు కోలాహలంగా జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి పి.సత్యేంద్ర, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ నిచ్చారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిపుణుడు కురెళ్ల కిషోర్ చిన్నారులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.

వైభవంగా షిర్డీ సాయినాథుని వార్షికోత్సవం



ఆకట్టుకున్న చిన్నారుల కోలాట ప్రదర్శన

భీమడోలు: భీమడోలు పాలశీతలీకరణ కేంద్రం వద్ద వేంచేసియున్న సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని, సాయినాథుడిని పువ్వులతో సుందరంగా అలంకరించారు. పూజారి బృందావన శేషభట్టాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భీమడోలులోని దాస సాహిత్య భజన మండలి ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. బాబాను దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



చిలకంపాడులో 104 వైద్యసేవలను పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

గణపవరం: గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.ప్రియాంక అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడులో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి నెలా పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని, ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, హెచ్ఐవీ, బరువు, గర్భంలో శిశువు ఎదుగుదల, శిశువు కదలికలపై పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. మండలంలోని తాళ్లమూడిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న 3 వ్యక్తుల నుంచి రూ.10,130 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బీ నాగబాబు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం

ఉంగుటూరు: విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నామని ఆశాఖ అధికారులు తెలిపారు. ఉంగుటూరులో శిథిలమైన స్తంభాల స్థానంలో కొత్తవి నిర్మించారు. వేలాడే తీగలను సరిచేశారు. రెండురోజుల నుంచి విద్యుత్ సిబ్బంది ఉంగుటూరులో మరమ్మతు పనులు పూర్తి చేయడంతో సమస్యలు తొలగనున్నాయి.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: మండలంలో 5 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. చిన్న వెల్లమిల్లి, తల్లాపురం, రామన్నగూడెం, సీతారామపురం, కైకరంలో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు తెలిపారు. 2022 జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలులోపు ఉండాలని సీడీపీవో తెలిపారు. పదో తర గతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- విజయరాయి హెల్త్‌క్లినిక్‌లో వైద్యసేవలు ప్రారంభం



విజయరాయిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ పేదవారికి విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. పెదవేగి మండలంలో 28 సచివాలయాలు ఉన్నాయని, అతి పెద్ద జనాబా కలిగిన మండలంగా పెదవేగి రూపాంతరం చెందిందని, ఇంత పెద్ద మండలానికి ఒకే ఒక్క ప్రాథమిక వైద్యశాల ఉందని, రెండో పీహెచ్‌సీ ఉండకపోతే ఇబ్బందిగా ఉందని నేరుగా దెందులూరు పర్యటనకు వచ్చేసిన సీఎం దృష్టిలో పెట్టామని చెప్పారు. ఈ మేరకు వెంటనే స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతి ఇచ్చి విజయరాయిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయడం సంతోషకదాయకమన్నారు.

199 ఇళ్ల పట్టాల పంపిణీ...

పేదలకు సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిదని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి సచివాలయంలో శుక్రవారం ఇళ్లు లేని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించి, వారి ముఖంలో సంతోషాలు చూశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి, బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, లేగల శివ, పులగం వేణుగోపాల్‌రెడ్డి, పీబీ శ్రీనివాసకృష్ణ, గొట్టాపు నాగేంద్ర, ఆళ్ళ చంద్రశేఖరరెడ్డి, రెడ్డెం శ్రీనివాసరెడ్డి, మట్టా శంకర్, లాయర్ రంగారావు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.